క్లుప్తంగా

కార్మికుల ఆందోళన



చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద మోకాళ్లపై నిలబడి ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ చిన్నింపేట గ్రామంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు శనివారం మోకాళ్లపై నిలబడి ఆందోళన చేశారు. కార్మికులు ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం తమకు న్యాయం చేయాలన్నారు. తమ డిమాండ్లు నేరవేర్చాలని కోరారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిచి, ఉపాధి కల్పించాలన్నారు. కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీ విజేతలతో రోటరీక్లబ్ ప్రతినిధులు

తుని: రోటరీ క్లబ్ రంగం యువజనోత్సవాల్లో భాగంగా రాజా కళాశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయని ప్రోగ్రాం కమిటీ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. తుని, పాయకరావుపేటలకు చెందిన 20 జట్లు సీనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొని ప్రతిభ చూపాయి. సీనియర్స్ విభాగంలో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల (ప్రథమ), రన్నర్స్‌గా సిద్ధార్థ జూనియర్ కళాశాల(తుని), జూనియర్స్ విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ (ప్రథమ), రన్నర్స్‌గా రాజా జూనియర్ కళాశాల (తుని) విజేతులుగా నిలిచారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుని రూరల్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం నిర్వహించనున్నట్టు ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో నాక్ బృందం వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యటిస్తుందన్నారు. అందులో భాగంగా 28న మధ్యాహ్నం రెండు గంటలకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. పూర్వ విద్యార్థులతో నాక్ కమిటీ సభ్యులు సమావేశమవుతారన్నారు. పూర్వ విద్యార్థులు సకాలంలో పాల్గొని అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తుని: ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు కోరారు. మంగళవారం సాయంత్రం యూనియన్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ వాహనాల కండీషన్ మెరుగుపరచడం, కండక్టర్లు, డ్రైవర్లు తక్కువ ఉన్నందున ఇబ్బందులు పడుతున్నారన్నారు. కండక్టర్ నసిక్ జీతం, డ్యూటీలు తదితర సమస్యలపై డిపో మేనేజరు వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. జనరల్ సెక్రటరీ ఎ.వి.రామరావు, రీజనల్ సెక్రటరీ ఎ.వి.రావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలతో రైతుల్లో గుబులు

కిర్లంపూడి: తుపాను హెచ్చరికలతో ఖరీఫ్ వరి కోతలు కోసిన రైతుల్లో గుబులు మొదలైంది. మండలంలోని సుమారు 11,500 వరి పంటలను రైతులు సాగు చేశారు. సుమారు 950 వరకు పంటలు ఒబ్బిడి చేసుకున్నారు. 4300 కోతలు కోసి పొలాల్లో పనలపై ఉన్నాయి. 6వేల ఎకరాలు వరి చేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. 450 ఎకరాల్లోని కుప్పలు నూర్చి ధాన్యం కల్లాలపై ఉన్నాయి. ఎండలు తగ్గుముఖం పట్టడంతో కల్లాలోని ధాన్యం ఎండడం లేదని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో రైతులందురూ వరి చేలు కూడదీసే పనిలో ఉన్నారు. వాతావరణం సూచనలు అనుసరిస్తు కోతలు ప్రారంభించాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత అన్నారు.

పీడీఎస్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: పీడీఎస్ బియ్యంలో పోషకాలు మెండుగా ఉంటాయని, అటువంటి పీడీఎస్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌ఓ ఎం.నాగాంజనేయులు అన్నారు. స్థానిక అరవపేటలో మంగళవారం ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యం ఉపయోగాలపై అవగాహన లేక బియ్యం పక్కదారి పడుతుందన్నారు. ఇందులో అధిక పోషకాలు ఉంటాయన్నారు. ఈ బియ్యం కొన్నవారితోపాటు అమ్మిన వారి కార్డును రద్దు చేస్తామన్నారు. వచ్చే నెలలో కొత్త రేషన్ కార్డులు అందించడంతోపాటు కార్డులలో మార్పులు చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఓ సునీత, మండల రేషన్ డీలర్ల యూనియన్ అధ్యక్షుడు మలిరెడ్డి బుల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో దుకాణాల బంద్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వర్తక సంఘ సభ్యుడు, కిరాణా షాను యజమాని యర్రా వీరబాబు మంగళవారం మృతి చెందారు. వీరబాబు మృతికి సంతాపంగా గ్రామంలోని వర్తక సంఘం ఆధ్వర్యంలో దుకాణాలను మూసివేశారు.

నడక యాతన

- దారుణంగా మారిన గిరిజన గ్రామాల రహదారులు
- మరమ్మతులకే పరిమితమైన ధారపల్లి–కె.మిర్తివాడ రోడ్డు
- తుప్పలతో పెదమల్లాపురం–బావన్నధార రోడ్డు
- గోతులతో బావన్నధార–ఉలిగోగుల రహదారి
- అటవీ శాఖ అనుమతులు లేకపోవడమే శాపం
- ఏళ్లు గుడుస్తున్నా గిరిజనులకు కలగని మోక్షం



ఇటీవల మరమ్మతు పనులు చేపట్టిన ధారపల్లి - కె.మిర్తివాడ రహదారి

ప్రత్తిపాడు రూరల్: సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో బురదకోట పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో గిరిజనులు నరకయాతనకు గురవుతున్నారు. గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారి అయిన బురదకోట రహదారి మరింత దారుణంగా తయారైంది. ఈ రోడ్డు దశాబ్ద కాలానికి పైగా మరమ్మతు పనులకే పరిమితమైంది. భారీ నిధులు వెచ్చించి చేపట్టిన మరమ్మతు పనులు ఒక్క వర్షానికి పోతుంది. మళ్లీ యథాస్థితికి వస్తుంది. ఫలితంగా ఈ రహదారిపై ప్రయాణించేందుకు గిరిజన ప్రజలు నరకయాతన పడుతున్నారు. పెద్దిపాలెం నుంచి కిత్తమూరిపేట వరకూ ఉన్న రహదారిని ఐదేళ్ల క్రితం పునర్నిర్మించారు. అక్కడ నుంచి దారపల్లి వరకూ ఉన్న రహదారికి ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ వర్షం పడితే బురదమయంగా మారుతుంది. సైకిళ్లు, బైక్‌లు బురదలో కూరుకుపోయి గిరిజనులు నానా పాట్లు పడుతున్నారు. ధారపల్లి నుంచి బురదకోట వరకూ కొండ ప్రాంతంలో రెండున్నర కిలోమీటర్ల ఉన్న రోడ్డు రాళ్లు లేచిపోయి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల మరమ్మతు పనులు చేపట్టినా రాళ్లు పైకి లేచి పోవడంతో ఆదమరచి ప్రయాణిస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఈ రోడ్డులో తరయూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిలోనే గిరిజన ఉత్పత్తులను పెద్దిపాలెం వారపు సంతకు తరలిస్తుంటారు. నిత్యం గిరిజనులు తిరిగే ఈ రోడ్డు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రహదారి నిర్మాణానికి అటవీశాఖ అనుమతులను సాకుగా చూపిస్తూ అధికారులు ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారికి శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

పలు మార్లు రద్దయిన నిధులు

ఇప్పటికే రహదారి నిర్మాణానికి మంజూరైన నిధులను ప్రభుత్వం రెండు సార్లు అటవీశాఖ అనుమతులు పేరుతో రద్దు చేసింది. రహదారి నిర్మాణం నిమిత్తం 2007లో ఐటీడీఏ రూ.25 లక్షలు, 2008లో పీఎంఆర్‌జీవై రూ.1.38 కోట్లు, 2018లో రూ.కోటి ప్రభత్వం నిధులు మంజూరు చేసింది. రహదారి పనులు శంకుస్థాపనలకు మించి ఒక్క అడుగు ముందుకు పడడంలేదు.

అటవీశాఖ అనుమతుల్లేక..

అటవీశాఖ అనుమతులే రహదారికి శాపమైంది. పెద్దిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కిత్తమూరిపేట నుంచి బాపన్నధారకు 6 కిలోమీటర్ రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందులో రెండు కీలోమీటర్లు మాత్రమే అటవీప్రాంతం వుంది. దీంతో అటవీశాఖ అధికారులు కేవలం గ్రావెల్ రోడ్డు మాత్రమే అనుమతిస్తున్నారు. సిమెంట్, తారు రోడ్డు వేసేందుకు నిరాకరిచడంతో ఏళ్ల గడుస్తున్నా రహదారి పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కరుణించి రహదారిని నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.



కిత్తమూరిపేట నుంచి ధారపల్లి వెళ్లే రోడ్డు



తుప్పలతో మూసుకుపోయిన బాపన్నధార- పెదమల్లాపురం రోడ్డు

తుప్పలతో మూసుకుపోయిన రహదారులు

బురదకోట గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు కిలోమీటర్లు ఉన్న కె.మిర్తివాడ నుంచి బాపన్నదార రోడ్డు, ఆరు కిలోమీటర్లు ఉన్న పెదమల్లాపురం–బాపన్నదార రోడ్డు, నాలుగు కిలోమీటర్లు ఉన్న బాపన్నధార–కొండ సింగారం రోడ్డు మీదుగా ఉలిగోగుల రహదారులు తుప్పలతో పూర్తిగా మూసుకుపోయాయి. మూడు కిలోమీటర్లు ఉన్న బురదకోట–కొండపల్లి రోడ్డు భారీ గోతులతో రాళ్లు లేనిపోయి అత్యంత దారుణంగా ఉంది. ఈరహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

నరకం చూస్తున్నాం



బురదకోట గ్రామ పంచాయతీ పరిధిలోని రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. రాకపోకల్లో నరకం చూస్తున్నాం. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేదు. రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు పనులు చేపట్టి కరుణించాలి.

– బచ్చల విష్ణవ కుమార్, గిరిజన హక్కుల సాధన సంఘం నాయకుడు, పాదురుపాక

అధికారులు స్పందించాలి



బురకోట గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలోని ధారపల్లి–కె.మిర్తివాడ వరకు ఉన్న రహదారి తాత్కాలికి నిర్మాణ పనులకే పరిమితమైంది. కె.మిర్తివాడ నుంచి బాపన్నదార, పెదమల్లాపురం–బాపన్నదార, బాపన్నదార–కొండ సింగారం మీదుగా ఉలిగోగుల రహదారులు తుప్పలు పెరిగిపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. బురదకోట–కొండపల్లి రోడ్డు భారీ గోతులతో రాళ్లు లేనిపోయి దారుణంగా ఉంది. అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలి.

– చింతల రాజు, బాపన్నదార

ఒంటిమామిడి పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

తొండంగి: ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పలు కేసులకు సంబంధించిన రికార్డులు, క్రైమ్ స్టేటస్ తదితర విషయాలపై తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై జగన్మోహన్ రావులతో చర్చించారు. స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. తొండంగిలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆరుగురికి రూ.60 వేల జరిమానా

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురు నిందితులకు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.60 వేలు జరిమానా విధించారు. స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు కథనం ప్రకారం.. ప్రత్తిపాడు సర్కిల్‌లోని ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది వాహన తనిఖీ చేపట్టగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

నారుమడి, శనగలు విత్తే సమయంపై అవగాహన

గండేపల్లి: మండలంలోని జెడ్ రాగంపేట, తాళ్లూరు గ్రామాలలో మంగళవారం ఏఓ సద్గురుమూర్తి రబీ నారుమడి, శనగలు విత్తే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి లావణ్య మాట్లాడుతూ పామాయిల్ అధిక దిగుబడికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

ప్రజా సమస్యలపై స్పందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు స్పందించి పరిష్కరించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు యిజన గిరి ప్రసాద్ మాట్లాడుతూ తమ గ్రామమైన తూర్పు లక్ష్మీపురం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలన్నారు. గ్రామంలో ఉన్న శ్మశాన వాటిక సమస్య పరిష్కారించాలన్నారు. దీనిపై ఎంపీపీ సానుకూలంగా స్పందించారు. అనంతరం పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. తొలుత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

70 లీటర్ల సారా స్వాధీనం

ప్రత్తిపాడు: గ్రామాల్లో కాకినాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. రాచపల్లి గ్రామంలో విక్రేత భూలక్ష్మిని అరెస్టు చేసి, ఆమె నుంచి 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేస్తున్న పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన సూరంపూడి సుమన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పెద్దిపాలెం గ్రామంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను, 40 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఈ కేసులో పెద్దిపాలెం గ్రామానికి చెందిన నైనపు నాగరాజుపై కేసు నమోదు చేసినట్టు కాకినాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై విజయలక్ష్మి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రత్తిపాడు: ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం అమ్మదలిస్తే సాధారణ రకాలైన సంపద, స్వర్ణ, ఎంటీయూ 1064 తదితర రకాలకు 75 కేజీలకు రూ.1,725, ఏ గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇస్తామన్నారు. దాళ్వాలో అపరాలు పండించాలనుకునే రైతులకు వీబీఎన్ 8 రకం మినుములు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉన్నాయని ఏఓ యింటి వీర గంగాధర్ తెలిపారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు, ప్రత్తిపాడు చెరువులు కాలువల్లో పూడికతీత పనులు, జల జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు, తదితర వాటిపై ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, మండల విద్యాశాఖాధికారి వి రాజబాబు, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, ఏపీఓ కుమార స్వామి, ఏపీఎం వై.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో పాతకొట్టాం భజన బృందం



తిరుమలలో భజన చేస్తున్న పాతకొట్టాం శ్రీసీతారామ భజనబృందం సభ్యులు

కోటనందూరు: తిరుమలలో నిత్యం జరిగే అఖండ హరినామ సంకీర్తనలో కోటనందూరు మండలం పాతకొట్టానికి చెందిన శ్రీసీతారామ భజన బృందం పాల్గొంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు 14 మంది బృంద సభ్యులు తిరుమలకు వెళ్లారు. వేంకటేశ్వరస్వామి దివ్య సన్నిధిలో ఆస్థాన మండపంలో బృంద సభ్యులు మంగళవారం రెండు విడతలలో నాలుగు గంటల పాటు భజన చేశారు. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు కీర్తనలతో భక్తులను అలరించారు. 2022 సంవత్సరంలో ఏర్పడిన ఈ భజన బృందం గురువు మేడసాని రాజు ఆధ్వర్యంలో ఏకాహం, సప్తాహం కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక గేయాలతో హరినామ సంకీర్తన చేశారు. ఇలా చేసిన సంకీర్తనలను వీడియోల రూపంలో టీటీడీ హిందూ ధార్మిక ప్రచార పరిషత్‌కు పంపించారు. అక్కడ అధికారుల పరిశీలన అనంతరం బృంద సభ్యులకు పిలుపు వచ్చింది. భజన బృంద సభ్యులకు టీటీడీ ఉచిత వసతి, ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తారని, ప్రయాణ ఖర్చులను నేరుగా సభ్యుడి బ్యాంకు ఖాతకు జమ చేయనున్నట్టు గ్రామ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతినిధి యడ్ల చెల్లారావు తెలిపారు.

ఆయుర్వేద వైద్యుడికి సత్కారం



జగ్గంపేట క్షత్రియ కళాపరిషత్‌లో ప్రముఖ ఆయుర్వేద వైద్యులను సత్కరించిన సంఘం నేతలు

జగ్గంపేట: ఆయుర్వేద వైద్యుడిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకున్న గోవిందపురం గ్రామానికి చెందిన గొట్టిముక్కల రవివర్మను మంగళవారం స్థానిక క్షత్రియ కళాపరిషత్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా త్వరలోనే క్షత్రియ కళాపరిషత్‌కు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ ప్రముఖులు, ఎస్‌వీఎస్ అప్పలరాజు, రవివర్మ సోదరుడు గొట్టుముక్కల నాని, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలి

గోకవరం: విజయవాడ జింఖానా మైదానంలో డిసెంబర్ 4న ఏర్పాటు చేసిన ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం గోకవరంలో ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎగుపాటి అర్జునరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో చేపట్టిన ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు జగ్గంపూడి రాజా, సిద్ధాబత్తుల అప్పారావు, కాపారపు సింగరయ్య, దిమ్మితి అప్పారావు, జగ్గు నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం ఇచ్చినా, తీసుకున్నా నేరం

న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: వరకట్నం నేరం.. వరకట్నం ఇచ్చినా తీసుకున్నా నేరస్తులేనని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను హెచ్చరించారు. 'వరకట్న వ్యతిరేక దినం' సందర్భంగా మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ సలహా సహాయ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి కాటం భాను విచ్చేసి ప్రసంగించారు. కట్నం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమేనని, అనాదిగా వస్తున్న ఈ సాంప్రదాయాన్ని, ఆచారాన్ని, ఈ ఆధునిక కాలంలో కూడా కొనసాగించడం దురదృష్టమన్నారు. ఈవరకట్నం వల్ల అబలల జీవితాలు అన్యాయమైపోతున్నాయని, వరకట్నాన్ని వ్యతిరేకించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని న్యాయమూర్తి కాటం భాను అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ ప్రధాన కార్యదర్శి బొంగుభూరి మధుబాబు, బండారు నరసింహరావు, అవసరాల దేవి, పోతుల జోగేష్, ఆకుల హరిబాబు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి భాను

బాల్య వివాహాలపై ప్రజల్ని చైతన్యవరచండి

రౌతులపూడి: సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రజలందరినీ చైతన్య పరచాలని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. బాల్యవివాహ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా రౌతులపూడిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, వీఆర్వోలకు మహిళా సంరక్షకులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌ఓజీ వెంకట్రావు, మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



ఏలేశ్వరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాలమహానాడు శ్రేణులు



ఆకట్టుకున్న హంసవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల మానవహారం



రాజ్యాంగంపై శ్రీప్రకాష్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది మధురాగ్రేస్

ఏలేశ్వరం: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి మాలమహనాడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుప్పల నాగభూషణం, బత్తిన శ్రీనివాస్, పేకల జాన్, వసంత యోహాన్, మద్దెల రమణ, థామస్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు, పైల విజయ్ కుమార్, కోరాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తామరాడ జిల్లా పరిషత్ ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.కృష్ణ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే భారత రాజ్యాంగాన్ని గౌరవించి పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు ఎంపీపీ కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మెజిస్ట్రేట్ కాటం భాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, బార్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

జగ్గంపేట: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కుతోందని జగ్గంపేట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా అన్నారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా స్థానిక దళిత కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గుర్రం మహాలక్ష్మి, పెద్దకాపు, గాది సత్తిబాబు, పల్లపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో మంగళవారం 75 జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మెహర్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.దివాకర్‌రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.మల్లేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు విమర్శించారు. ధర్మవరంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తుని: రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది జి.పి.మధురాగ్రేస్ అన్నారు. మంగళవారం శ్రీప్రకాష్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యా ర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తుని రూరల్: హంసవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మజ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు దేశాధినేతల వేషధారణలో అలరించారు. విద్యార్థులంత మానవహారంగా ఏర్పడి రాజ్యాంగ స్ఫూర్తిని వెలుగెత్తారు.

తుని రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రధాతని హంసవరం సర్పంచ్ రాయి మేరీ అవినాష్ అన్నారు. హంసవరంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు



టీజే నగరంలో వరిసాగుపై రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

కోటనందూరు: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ సూచించారు. టీజే నగరం, బొద్దవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మట్టి నమూనాల పరీక్షల ఆధారంగా మండలంలో నత్రజని, జింకు, పొటాష్ లోపం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వచ్చే రబీ, ఖరీఫ్ పంటల సమయంలో ఖనిజాల సమతుల్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. భూసారాన్ని పెంచుకోవాలన్నా, నాణ్యమైన పంటలు పండించుకోవాలన్నా రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం వరి, ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేసారు. ఏఈఓలు శివకుమారి, సురేష్, వీఏఏలు పాల్గొన్నారు.